


ఇంటి పన్ను చెల్లిస్తేనే ఉచిత విద్యుత్ అట..!

నవాబుపేట, ఫిబ్రవరి12: ప్రభుత్వం అమలు చేయనున్న గృహజ్యోతి పథకం 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను పొందాలంటే ఇంటి పన్ను చెల్లించాలని సోమవారం లక్నాపూర్ గ్రామంలో చాటింపు చేశారు. దీంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉచిత విద్యుత్‌కు పన్నుకు ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్వేతను వివరణ కోరగా ఉన్నతాధికారుల నుంచి ఇంటి పన్ను వసూలు చేయాలని ఒత్తిడి ఉండటంతో చాటింపు వేసినట్లు తెలిపారు.

సిండికేట్ దందాకు వికారాబాద్ జిల్లాలో పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డు కేరాఫ్‌గా మారింది. ఈ మార్కెట్‌లో లావాదేవీలన్నీ ఒకరిద్దరి చేతుల్లోనే కొనసాగుతున్నాయి. వారు చెప్పిందే వేదం..వారు నిర్ణయించిందే ధర.. లేదంటే ఆ ధాన్యం కొనుగోలు చేసే దిక్కుండరు. దీంతో రైతులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంలో ఉన్నారు. నిలువు దోపిడీకి గురవుతున్నారు.

- వ్యాపారులు, ట్రేడర్స్‌దే రాజ్యం
- వారు చెప్పిందే ధర... లేదంటే కొనేవారుండరు
- వారికి కొమ్ముకాస్తున్న మార్కెట్ అధికారులు
- వ్యాపారం రూ. కోట్లలో..చూపుతున్నది రూ.లక్షల్లో..
- పరిగి మార్కెట్‌లో చీకట్లోనే తుకాలు.. దందా
- నిలువునా మోసపోతున్న రైతులు





మా మాటే.. శాసనం!

పరిగి వ్యవసాయ మార్కెట్‌లో సిండి'కేటు'దందా



జనవరి 27న గిట్టుబాటు ధరకోసం రైతుల నిరసన (ఫైల్)

తూకాల్లో మోసం

ధాన్యానికి ధరను నిర్ణయించడం అటుంచితే వ్యాపారులు తుకాల్లో కూడా పెద్ద ఎత్తు మోసాలకు పాల్పడుతున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలకు ముందుగానే సెట్టింగ్ చేసి ఉంచడంతో రైతు ముందు అంతా బాగానే ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ, క్వింటాలుకు పది కిలోల వరకు మోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. చీకట్లో తుకాలు చేయొద్దనే నిబంధనలు ఉన్నప్పటికీ పరిగి మార్కెట్‌లో అవన్నీ వారికి పట్టవు. లైట్లు బంద్‌చేసి చీకట్లోనే రాత్రి 11 గంటల వరకు కూడా తుకాలనువేస్తున్నారు. దీంతో వ్యాపారులకు కాసుల పంట పండుతోంది.

అంతా జీరో దందానే..

పరిగి వ్యవసాయ మార్కెట్‌లో జోరుగా జీరో దందా సాగుతోంది. ఇక్కడ రోజు రూ. కోట్లల్లో లావాదేవీలు జరుగుతుండగా చూపిస్తున్నది మాత్రం రూ. లక్షల్లోనే... పరిగి మార్కెట్‌లో ఈ ఏడాది రూ.1.78 కోట్ల ఆదాయ లక్ష్యం ఉంది. ఈ ఆదాయం ఇక్కడ పదిశాతం చూపితేనే రూ.1.78 కోట్లు దాటే అవకాశం ఉంది. గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.87లక్షల ఆదాయం వచ్చింది. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మార్చి చివరి నాటికి రూ.90 లక్షల ఆదాయం రావాలి. ఇప్పుడు సీజన్‌లో ఒకే నెలలో లక్ష్యం చేరడం సాధ్యమే.. కానీ, ఇక్కడ మార్కెట్‌ను వ్యాపారులే శాసించడంతో మార్కెట్ ఫీజు ఇవ్వకుండా తరలిస్తున్నారు. కొందరు వ్యాపారులు మార్కెట్ నుంచి వే బిల్లులు తీసుకోకుండానే దొంగ వే బిల్లు రశీదులతో కూడా వ్యాపారాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మార్కెట్‌కు వచ్చే ధాన్యమంతా రికార్డుల్లో చూపిస్తే కోట్ల ఆదాయం రానుంది.



పరిగి మార్కెట్‌లో చీకట్లోనే తుకాలు (ఫైల్)

పరిగి,ఫిబ్రవరి 12: పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డును వ్యాపారులే శాసిస్తున్నారు. మార్కెట్‌లో కమీషన్లకు మరిగిన అధికారులు డమ్మీగా మారిపోయారు. దీంతో రైతులు పంటల అమ్మకాల్లో నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఏడాదంతా చమటోడ్చి కష్టించి పండించిన పంటలను అమ్మడానికి పరిగి మార్కెట్‌కు వచ్చిన రైతులకు పట్టపగలే కుచ్చుటోపి పెడుతున్నారు. మార్కెట్ అధికారులు రైతుల గురించి అసలు పట్టించుకోకపోవడంతో వ్యాపారుల అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. తామేమి చేసినా చెల్లుతుందన్న ధీమాతో వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. గతనెల 27 మార్కెటింగ్ శాఖ సంచాలకులు లక్ష్మీబాయి, డిప్యూటీ డైరెక్టర్ పద్మహర్ష పరిగి మార్కెట్ యార్డును తనిఖీ చేశారు. అధికారులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన సంగతి విదితమే. అయినావారిలో మార్పులేదు. ఇంకా ఎక్కువ స్థాయిలో మోసాలకు పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు.

70 లైసెన్సులకు.. పది మందే లావాదేవీలు

పరిగి మార్కెట్‌యార్డులో 70కి పైగా లైసెన్స్‌దారులున్నారు. ఇందులో మాత్రం లావాదేవీలు నిర్వహించేది పది మందిలోపే. 56 మంది కమీషన్ ఏజెంట్లు, 14 మంది ట్రేడర్లు ఉన్నారు. అయితే మార్కెట్ అధికార యంత్రాంగం ఉన్నా డమ్మీగా మారిపోయింది. మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పంటలను మార్కెట్ అధికారుల సమక్షంలో పరిశీలించి ధరలను నిర్ణయించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ కొందరూ కమీషన్ ఏజెంట్లు ఎంత చెబితే అంతే ధర... వారు నిర్ణయించిన ధరకే రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవాలి. లేదంటే ఇక్కడ రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎవరూ కొనుగోలు చేయరు.



గత వారం పరిగి మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ బస్తాలు

కమీషన్ ఏజెంట్లే నిర్ణేతలు

వ్యవసాయ మార్కెట్ అధికారుల ఆధ్వర్యంలో రైతుల ధాన్యానికి ధర నిర్ణయించాల్సి ఉండగా. ఇక్కడ అలాంటిదేమీ జరుగదు. ఎందుకంటే కమీషన్ ఏజెంట్లే ఇక్కడ న్యాయనిర్ణేతలు. వారు చెప్పిందే వేదం. ఇక్కడి అధికారులు వారిచ్చే కమీషన్లకు అలవాటుపడి రైతులను నిలువునా మోసం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రైతులు ఆదాయాన్ని ఆర్జించే మార్కెట్ అధికారులు వారి గురించి పట్టించుకోకుండా వ్యాపారస్తులకే కొమ్ముకాస్తుండడంతో పరిగి మార్కెట్ అక్రమ వ్యాపారానికి అడ్డాగా మారింది. ఉదాహరణకు పరి క్వింటాలుకు రూ.2200 నిర్ణయిస్తే అందరూ అదే ధరకు కొనాలి. ఎవరైనా ఎక్కువ ధరకు పాడితే వారిపై మిగతా ట్రేడర్స్ కలిసి మూకుమ్మడిగా దాడి చేస్తున్నారు. ఎవరైనా ఇతర ప్రాంతాల నుంచే వచ్చే ట్రేడర్స్ ఎక్కువ ధరకు కొందామని సాహసం చేసినా వాడికి మూడినట్లే. స్థానిక వ్యాపారుల బెదిరింపులతో వారు కొనడానికే వెనకాడుతున్నారు. దీంతో బయట నుంచే వచ్చే ట్రేడర్స్ పరిగి మార్కెట్‌కు రావడమే మానేశారు. ఇక స్థానిక ట్రేడర్స్‌దే ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతున్నది. మార్కెట్‌కు వచ్చిన ధాన్యానికి సిండికేట్ మారి ధర నిర్ణయించి ఉన్న నలుగురు ట్రేడర్లే పంచుకుంటున్నారు. ఈ వ్యవహారం చాలా రోజుల నుంచి నడుస్తున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

నిలువు దోపిడీ

పరిగి మార్కెట్‌లో వ్యాపారులు రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. యార్డులో ప్రతి శుక్రవారం బీట్లు జరుగుతాయి. యాసంగి సీజన్‌లో మాత్రం శుక్రవారం నిర్ణయించిన ధరకే శని, ఆది, సోమవారాల వరకు కొనుగోలు చేయడం జరుగుతోంది. దీంతో రైతులు దోపిడీకి గురవుతున్నారు.

చేతివృత్తులకు చేయూత

- అర్హులకు బ్యాంకర్లు రుణాలు అందించాలి
- మేడ్చల్‌జిల్లా కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతిప్రతినిధి) : అంతరించిపోతున్న చేతివృత్తుల వారికి పీఎం విశ్వకర్మ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించడం ద్వారా హస్త కళలకు జీవం పోసినట్టు అవుతుందని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ స్కీం కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఆధార్, రేషన్‌కార్డులు జత చేసి గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షికలక్ష్యం 18,370 కోట్లు, కాగా 44,287 కోట్లు మంజూరు చేసి 241 శాతంతో లక్ష్యాన్ని అధిగమించారన్నారు. లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకర్లు తమపనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. పట్టణ ప్రాంతమైన మేడ్చల్ జిల్లాలో యువతకు ఉన్నత విద్యాకు ఎక్కువ శాతం రుణాలు అందించడం ద్వారా యువత ఉన్నత విద్యా ప్రమాణాలను పొంది వారి బంగారు భవిష్యత్తుకు మైలురాజు అవుతుందన్నారు. రైతులకు పంట రుణాలు, టర్మ్ లోన్‌లు, వ్యవసాయ అనుబంధ రుణాలు విరివిగా అందించాలని కలెక్టర్ సూచించారు. ఎస్సీ ఎస్టీ , బీసీ, మైనార్టీ, పరిశ్రమల, డీఆర్‌డీఓ తదితర శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు ఉపాధి యూనిట్ల స్థాపన , చిన్న మధ్య తరహావిద్య, గృహ నిర్మాణం ఇతర ప్రాధాన్య రంగాల్లో అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలని బ్యాంకర్లకు సూచించారు. సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కెనెరా బ్యాంకు డీజీఎం సంజయ్ కుమార్, లీడ్ బ్యాంకు మేనేజరు శ్రీనివాసులు, ఆర్బీఐ ఎల్‌డిఓ గోమతి, నాబార్డ్ అధికారి రమేష్, జీఎండీఐసి రవీందర్, జిల్లా వ్యవసాయాధికారి మేరీ రేఖా, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ.. బదిలీల జాతర

- జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో, డీఆర్‌డీవో, డీపీవోలకు ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు



రమాదేవి

వికారాబాద్/మేడ్చల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీల పరంపర కొనసాగుతూనే ఉంది. రెండు రోజుల కింద అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్ల బదిలీలు చేపట్టగా, ఆదివారం ఎంపీడీవోల బదిలీలు జరిగాయి. తాజాగా జడ్పీ సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీఆర్‌డీవో, అదనపు డీఆర్‌డీవో, డీపీవో, డీఎల్‌పీవోలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ అండ్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ (పీఆర్ అండ్ ఆర్‌ఈ) ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్‌జడ్పీ సీఈవో కె.జానకిరెడ్డి సంగారెడ్డి జడ్పీ సీఈవోగా బదిలీ కాగా, ఆయన స్థానంలో నిర్మల్ జడ్పీ సీఈవో ఎం.సుధీర్ బదిలీపై రానున్నారు. డీఆర్‌డీవో ఎంఎ కృష్ణన్ యాదాద్రి-భువనగిరి డీఆర్‌డీవోగా బదిలీ కాగా, ఆయన స్థానంలో మెదక్ డీఆర్‌డీవో ఎ.శ్రీనివాస్ జిల్లాకు రానున్నారు. జడ్పీ డిప్యూటీ సీఈవో ఎస్.సుభాషిణి రంగారెడ్డి అదనపు డీఆర్‌డీవోగా బదిలీ కాగా, ఆమె స్థానంలో జనగామ డిప్యూటీ సీఈవో ఎస్.వసంత జిల్లాకు రానున్నారు. అదనపు డీఆర్‌డీవో ఆర్.స్టీవెన్‌నీల్ ములుగుజిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఇంకా ఎవరికీ పోస్టింగ్‌ఇవ్వలేదు. జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తి తరుణ్ కుమార్ నిజామాబాద్ డీపీవోగా బదిలీ కాగా, ఆయన స్థానంలో నిజామాబాద్ డీపీవో పి.జయసుధ జిల్లాకు రానున్నారు. ఇదిలా ఉంటే, వికారాబాద్ డీఎల్‌పీవో వి.అనిత సంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, ఆమె స్థానంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డీఎల్‌పీవో సంధ్యారాణి వికారాబాద్‌డీఎల్‌పీవోగా బదిలీపై రానున్నారు.

ఎక్సైజ్ అధికారుల బదిలీలు

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (డీపీఈవో) ఎస్.నవీన్‌చంద్రను బదిలీ చేస్తూ ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ ఉత్తర్వులుజారీ చేశారు. నవీన్ చంద్రను సంగారెడ్డి డీపీఈవోగా బదిలీ చేయగా, ఆయన స్థానంలో మేడ్చల్ డీపీఈవో కె.విజయభాస్కర్‌ను నియమించారు. ఇదిలా ఉంటే, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారిగా పనిచేస్తున్న టి.ధన్వంత్‌రెడ్డిని హయత్‌నగర్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ కాగా, ఆయన స్థానంలో రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న కె.శ్రీనివాస్‌ను నియమించారు.పరిగి ఎస్‌హెచ్‌వో జి.చంద్రశేఖర్‌ను మల్కాజ్‌గిరి ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేయగా, ఆయన స్థానంలో విన్‌డాల్ డిస్టిల్లరీస్(ట్రాన్స్‌బీర్స్) వద్ద విధులు నిర్వహిస్తున్న పి.నీరజాదేవిని బదిలీ చేశారు. తాండూరు ఎస్‌హెచ్‌వో బి.అనంతయ్యను నాగర్‌కర్నూల్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో ఎల్.బాలగంగాధర్‌ను నియమించారు.

కీసర ఆర్డీవోగా రమాదేవి

అలాగే కీసర ఆర్డీవో రాజేష్‌కుమార్‌పై బదిలీ వేటు వేశారు.ఆయన స్థానంలో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ ఈవోగా పనిచేస్తున్న ఎల్ రమాదేవీని ఆర్డీవోగా నియమించారు. అయితే మేడ్చల్‌జిల్లా అదనపు కలెక్టర్ కంటే సీనియరైన రమాదేవీని ఆర్డీఓగా నియమించడం చర్చనీయాంశంగా మారింది.



- బడ్జెట్ ఆమోదం పొందితే అభివృద్ధి పనులు
- మున్సిపల్ కౌన్సిల్‌కు ఇదే చివరి బడ్జెట్

బల్దియా బడ్జెట్‌కు వేళాయె!

తాండూరు, ఫిబ్రవరి 12: మున్సిపాలిటీలో బడ్జెట్‌కు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈనెలాఖారులోగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి. ముందుగా అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు) వద్ద ప్రీబడ్జెట్ సమావేశం నిర్వహించిన అనంతరం మున్సిపాలిటీలో బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తారు. 2025 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించాల్సి ఉంటుంది. బడ్జెట్ ఆమోదం లేకపోతే అభివృద్ధి పనులు, కార్యనిర్వహణ చేయలేని పరిస్థితి ఉంటుంది. ఈ కౌన్సిల్‌కు ఇది చివరి బడ్జెట్. వికారాబాద్ జిల్లాలో తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలున్నాయి. మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారం జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీల్లోబడ్జెట్ సమావేశం నిర్వహిస్తారు. గతేడాది బడ్జెట్‌ను మరోసారి పరిపూర్ణంగా పరిశీలించి అదనంగా 5శాతం హెచ్చింపుతో బడ్జెట్‌ను తయారు చేస్తారు. పట్టణ సమగ్రాభివృద్ధితో పాటు పారిశుధ్యం, పచ్చదనం, క్రీడలు, గ్రీన్‌బడ్జెట్, పార్కులు, మురుగు కాల్వలతో పాటు కాలనీల అభివృద్ధి 1/3 వంతు నిధుల కేటాయింపు, కార్యాలయ నిర్వాహణ వంటి వాటికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి. జిల్లాలో తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీలు పెద్దవి పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు చిన్నవి. ప్రస్తుతం అకౌంట్ బడ్జెట్ తయారు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చే లోపే బడ్జెట్ సమావేశాలు ముగిసేలా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.



పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

- రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

వికారాబాద్, ఫిబ్రవరి12: జాండీస్‌తో అస్వస్థకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించి త్వరితగతిన కోలుకునేందుకు సత్వర సేవలు అందించాలని కలెక్టర్ నారాయణరెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. తాగునీటికి సంబంధించి, పాఠశాల మరమ్మతులు, లీకేజీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిష్కరించాలని మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌కు సూచించారు. కలెక్టర్‌తో పాటు డీఎస్‌డబ్ల్యూ మల్లేశం, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోనినిర్వహించిన ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 127 ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ నారాయణఅమిత్‌లతో కలిసి కలెక్టర్ స్వీకరించారు.

437 మంది
బడి బయటి పిల్లలు

- ముగిసిన సర్వే.. తేలిన లెక్క!

మేడ్చల్ ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కుటుంబ పరిస్థితులు అనుకూలంగా లేక చదువుపై ఆసక్తిఉన్నా... బడికి దూరం అవుతున్నారు పేద పిల్లలు. పాఠశాల అందుబాటులో లేక కొందరు, పక్క ఊరిలోని బడికి వెళ్లలేక మరికొందరు గ్రామీణ ప్రాంతాల్లో బాల కార్మికులుగా మారుతున్నారు. వీరిలో ప్రధానంగా పది, ఇంటర్మీడియట్ లోపు చదువులను ఆపేసిన వారు ఎక్కువగా ఉంటున్నారు. వీరిని గుర్తించి తిరిగి బడిబాట పట్టించేందుకు ప్రభుత్వం , పలుస్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. ఇటీవల సర్వే నిర్వహించగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల్లో 437 మంది బడి బయటి పిల్లలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. బడికెళ్లని పిల్లలను మళ్లీ బడిబాట పట్టించేందుకు సమగ్రశిక్షా అభియాన్ నిర్వాహకులు, విద్యాశాఖ అధికారులు జిల్లాలోని 15 మండలాల్లో ఇంటింటా సర్వే చేపట్టారు. రానున్న విద్యాసంవత్సరానికి(2024-25) సంబంధించి గడిచిన డిసెంబరు, ఈఏడాది జనవరి మాసాల్లో 6-19ఏళ్ల బడి బయటి పిల్లల సమాచారాన్ని సేకరించారు. ఆయా మండలాల్లో పనిచేస్తున్న సీఆర్‌పీలు, ఐఈఆర్పీలు తమ పరిధిలోని పాఠశాలల్లో సర్వే నిర్వహించారు. ఇల్లు, ఆవాస ప్రాంతాలు, ఇటుక బట్టీలు, కిరాణం దుకాణాలు, హోటళ్లు, క్వారీలవంటి ప్రదేశాలను సందర్శించి వివరాలను నమోదు చేశారు.

జిల్లాలో మొత్తం 437 మంది బడి బయటి పిల్లలను గుర్తించి వచ్చే విద్యా సంవత్సరానికి గాను తిరిగి ముందుగానే ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా తరగుతుల్లో చేర్పించారు. చదువులో వెనుకబడిన పిల్లలకు మూడు నెలల బ్రిడ్జి కోర్సులతో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తూ వయసుల వారీగా పాఠశాలల్లో చేర్పిస్తారు. అదేవిధంగా 15-19 ఏళ్ల వారిని వచ్చే విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. అయితే జనవరి 31వ తేదీ వరకు బడి బయటి పిల్లలను గుర్తించే కార్యక్రమం ముగిసింది. అయినా జిల్లా విద్యాశాఖ అధికారులు మొదట నిర్ణయించినప్పటికీ బడిబయట ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించేందుకు దీనిని పొడిగించారు.

బాలలందరూ చదువుకునేలా చర్యలు



గుర్తించిన బడి బయటి పిల్లలంతా చదువుకునే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. చదువుపై విద్యార్థులకు ఆసక్తి కలిగిస్తూ సార్వత్రిక విద్యలో భాగంగా పది, ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశాలు కల్పిస్తాం. ఈ అవకాశాలను గ్రామీణ ప్రాంతాల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి.

\- విజయలక్ష్మి, జిల్లా విద్యాధికారి



సీసీ రోడ్లకు రూ.2.50 కోట్లు మంజూరు

ధారూరు, ఫిబ్రవరి 12: జాతీయ ఉపాధిహామీ పథకం కింద సీసీరోడ్ల నిర్మాణానికి మండలానికి 48పనులకు రూ.2.50కోట్లు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో చెన్నారెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు సీసీరోడ్ల పనులను గ్రౌడింగ్ పూర్తిచేస్తామని ఆయన చెప్పారు. ధారూరుకు రూ.10లక్షలు, లక్ష్మీనగర్ తండాకు రూ.5లక్షలు, తిమ్మానగర్‌కు రూ.5లక్షలు, చింతకుంటకు రూ.5లక్షలు, హరిదాసుపల్లికి రూ.5లక్షలు, ఎబ్బనూర్‌కు రూ.5లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కొండాపూర్ గ్రామానికి రూ.10లక్షలు, కేరెల్లికి రూ.5లక్షలు, బాచారం గ్రామానికి రూ.5లక్షలు, నాగ్‌సాన్‌పల్లికి రూ.5లక్షలు, తరిగోపులకు రూ.10లక్షలు, మైలారం గ్రామానికి రూ.5లక్షలు, అల్లీపూర్‌కు రూ.5లక్షలు, మున్నూర్‌సోమారం గ్రామానికి రూ.10లక్షలు, కొండాపూర్‌కలాన్‌కు రూ.5లక్షలు, నర్సాపూర్‌కు రూ.5లక్షలు, గడ్డమీదిగంగారం గ్రామానికి రూ.5లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కుక్కిందకు రూ.10లక్షలు, అవుసుపల్లికి రూ.5లక్షలు, నాగసమందర్‌కు రూ.15లక్షలు, అల్లాపూర్‌కు రూ.5లక్షలు, రుద్రారంకు రూ.5లక్షలు, గట్టేపల్లికి రూ.10లక్షలు, కుమ్మర్‌పల్లి తండాకు రూ.5లక్షలు, ధర్మాపూర్‌కు రూ.5లక్షలు, రాంపూర్‌కు రూ.10లక్షలు, స్టేషన్ ధారూర్‌కు రూ.10లక్షలు, దోర్నాల్‌కు రూ.10లక్షలు, పీసీఎం తండాకు రూ.5లక్షలు, అంపల్లికి రూ.5లక్షలు, గురుదోట్లకు రూ.5లక్షలు, రాజాపూర్‌కు రూ.5లక్షలు, మెమిన్‌ఖుర్దుకు రూ.5లక్షలు, మోమిన్‌కలాన్‌కు రూ.10లక్షలు, అంతారం గ్రామానికి రూ.5లక్షలు, నాగారంకు రూ.15లక్షలు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మంజూరైనట్లు ఆయన వివరించారు.

ఎమ్మెల్సీ, జడ్పీచైర్‌పర్సన్‌కు సన్మానం



ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ మాజీచైర్మన్ విశ్వనాథ్‌గౌడ్

తాండూరు, ఫిబ్రవరి 12: బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డిని సోమవారం మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్ యువ నాయకులు సోమనాథ్‌గౌడ్, సుభాన్‌రెడ్డి తదితరులు కలిసి శాలువాతో సన్మానించారు. విశ్వనాథ్‌గౌడ్ గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన ఆయన తిరిగి సొంతగూటికి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా రాజేందర్‌గౌడ్

ధారూరు, ఫిబ్రవరి 12: ధారూరుకు చెందిన బీజేపీ నాయకుడు రాజేందర్‌గౌడ్‌ను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సోమవారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతను పూర్తిస్థాయిలో నెరవేరుస్తానన్నారు. తనకు ఈ పదవి ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డికి, సహకరించిన నాయకులు శివరాజ్, కేపీ రాజు, వివేకానందరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

'పట్నం' మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసంలో నెలకొన్న సస్పెన్స్

● క్యాంపును వీడిన ఇరువురు కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 12: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై సభ్యులు పెట్టిన అవిశ్వాసంపై సస్పెన్స్ నెలకొంది. బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన ఆమె అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో 24 మంది కౌన్సిలర్లకుగాను 15 మంది బీఆర్ఎస్, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 16న అవిశ్వాసానికి సంబధించి కౌన్సిల్ ప్రత్యేక సమావేశానికి జిల్లా కలెక్టర్ అనుమతినిచ్చారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించి ఈ సమావేశం ఏర్పాటు చేస్తారు. కాగా చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాన ప్రతిపై సంతకాలు చేసిన ఇరువురు కౌన్సిలర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వారిలో పదవ వార్డు కౌన్సిలర్ పి.శంకరయ్య ఇటీవలే కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం నుంచి ఆయన అందుబాటులో లేరు. బీఆర్ఎస్‌కు చెందిన 24వ వార్డు కౌన్సిలర్ జెర్కోని బాల్‌రాజ్ కూడా క్యాంపును వీడి వెళ్లిపోయినట్లు తెలిసింది. దీంతో అవిశ్వాసంపై సస్పెన్స్ నెలకొంది. 24 మంది సభ్యులలో 16 మంది సభ్యులు హాజరై చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఓటేస్తేనే అవిశాసం నెగ్గుతుంది. కానీ తాజాగా పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. అసలు ఏం జరుతుందోనని మున్సిపల్ ప్రజలు ఉత్కంఠతతో ఉన్నారు.

జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవోలకు సన్మానం

వికారాబాద్, ఫిబ్రవరి 12 : బదిలీపై వెళ్లనున్న జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డిప్యూటీ సీఈవో సుభాషిణిని జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్ సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు జిల్లాకు అందించిన సేవలను ఆయన గుర్తుచేశారు. బీఆర్ఎస్ బీసీ సెల్ నాయకుడు దత్తు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



అశోక్ (కుడి వైపు చివరన) ఉన్న వ్యక్తి

వికారాబాద్, ఫిబ్రవరి 12 : హైదరాబాద్‌లో జరిగిన 5వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో వికారాబాద్ పట్టణానికి చెందిన ముగ్గురు అథ్లెట్లు సత్తా చాటారు. గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో ఈనెల 8 నుంచి 11 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో నడక విభాగంలో అథ్లెట్లు శ్రీనివాస్, నరేష్ బంగారు, వెండి పతకాలు సాధించగా, హ్యామర్‌త్రో విభాగంలో బార్వాద్ అశోక్ కాంస్య పతకం సాధించారు. కాగా ఇటీవ జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ అశోక్ రాణించాడు. కోట్‌పల్లి మండలం, బార్వాద్ గ్రామానికి చెందిన ఆయన వికారాబాద్ మండలం, బూర్గుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. త్వరలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్ పోటీలకు ఎంపికయ్యాడు. పలువురు అభినందించారు.

రైతు సంక్షేమానికి మోదీ పెద్దపీట

మహేశ్వరం, ఫిబ్రవరి 12 : మునుపెన్నడూ లేని విధంగా దేశంలో అనేక రైతు సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ మోదీ చరిత్రలో నిలిచిపోతారని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో పది సంవత్సరాల పాలనలో కేంద్రం అమలు చేసిన రైతు సంక్షేమ కార్యక్రమాలను రైతులకు వివరించేందుకు చేపట్టిన గ్రామ పరిక్రమ యాత్ర ఉత్తరప్రదేశ్ నుంచి ప్రారంభమైన సందర్భంగా ప్రత్యక్షప్రసారాన్ని సోమవారం మహేశ్వరం మండలంలోని నాగారం గ్రామంలో ఓ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, పాపయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, పోతర్ల సుదర్శన్ యాదవ్, నాగారం ఎంపీటీసీ కె. వెంకటేష్, వెంకటేష్ గౌడ్, అశోక్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థులకు గోల్డ్‌మెడల్



ట్రోఫీతో కరాటే విద్యార్థులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 12 : అంతర్జాతీయ కరాటే పోటీలలో మండలానికి చెందిన సోను కరాటే అకాడమి విద్యార్థులు సత్తా చాటారు. ఆల్ స్టైల్ కరాటే, కుంగ్ఫూ చాంపియన్‌షిప్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్‌తో పాటు చాంపియన్‌షిప్ సాధించారు. హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో మూడవ అంతర్జాతీయ ఓపెన్ ఆల్ స్టైల్ కరాటే, కుంగ్ఫూ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి.పాల్గొన్నారు. చరణ్, దార్విక, అవోకర్, చర్రి, పూజ, ప్రణవి, పూజిత, రితికలు గోల్డ్‌మెడల్స్, సిరి, యాసిన్, అక్షిత, పూజ, శ్రీ నిహారిక, భువనేశ్వరిలు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు మాస్టర్ సోను చెప్పారు.

గోల్ఫ్ సెమీస్‌లో హైల్యాండర్స్, డీఎస్ఆర్ జట్లు

హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ సీజన్-4లో విలేజియో హైల్యాండర్స్, డీఎస్ఆర్, సామఏంజెల్స్, టీమ్‌ఆల్ఫా జట్లు సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. వికారాబాద్‌లోని ఊటీ గోల్ఫ్ కౌంటీలో జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో మేవరిక్స్‌పై హైల్యాండర్స్, టిరూట్స్‌పై ఏంజెల్స్, రైడర్స్‌పై ఆల్ఫా, టీమ్ క్లేమ్‌పై డీఎస్ఆర్ జట్టు గెలిచి, టైటిల్‌కు చేరువయ్యాయి. సెమీస్ మ్యాచ్‌లు ఊటీ గోల్ఫ్ కౌంటీలోనే జరగనున్నాయి. ఫైనల్ దుబాయ్‌లో జరగనుంది.

తల్లిదండ్రులను మించిన దైవం లేదు

● ఘనంగా తల్లిదండ్రుల పూజా కార్యక్రమం



పాదపూజ చేస్తున్న విద్యార్థులు

షాబాద్, ఫిబ్రవరి 12 : తల్లిదండ్రులను మించిన దైవం లేదని సంత్ ఆశారాం బాపూజీ ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ అమర్‌నాథ్, పరమేశ్వర్‌లు అన్నారు. సోమవారం మండల పరిధిలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో సంత్ ఆశారాం బాపూజీ ఆశ్రమం ఆధ్వర్యంలో తల్లిదండ్రుల పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్, పరమేశ్వర్ మాట్లాడుతూ పిల్లలు తమ తల్లిదండ్రులను గౌరవించాలని, వృద్ధాప్యంలో వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. తల్లిదండ్రుల గొప్పతనాన్ని విద్యార్థి దశ నుంచే వివరించాలన్నారు. యువత పెడదారి పట్టకుండా 18 సంవత్సరాలుగా తల్లిదండ్రులకు పూజా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీరాములు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

● ఆరు రోజుల పాటు ఉత్సవాలు

● భక్తులకు వసతుల కల్పన

కడ్తాల్, ఫిబ్రవరి 12 : మండలం పరిధి మక్తమాదారంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం అవుతాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం ఆలయ ధర్మకర్త వింజమూరి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం (నేటి) నుంచి ఈ నెట 18 వరకు ఈ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. ఆరు రోజులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆయన చెప్పారు.



మక్తమాదారం శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం

ఈ నెల 20 నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మిచెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రతీ ఏటా జరిగే బ్రహ్మోత్సవాలను ఆలయ నిర్వాహకులు ఈనెల 20 నుంచి 26 వరకు నిర్వమించబోతున్నారు. అందు కోసం దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వసతులు ఏర్పాటు చేశారు. ప్రముఖ అర్చకుడు మెళ్లూరి వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో ఈ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. ఏడు రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాలను బ్రహ్మోత్సవాల కమిటీ చైర్మన్ టి. వేణుగోపాల్, ఈవో మోహన్‌రావు తెలిపారు. ఏడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అర్చకులు తిరునగరి వెంకటేశ్, తిరునగరి శ్రీధర్, నర్సింహమూర్తి, శ్రీమన్నారాయణలు కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కడ్తాల శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షికబ్రహ్మోత్సవాలను విజయ వంతం చేయాలని ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు కోరారు. ఈ దేవాలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈనెల 20 నుంచి 26 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎంపీపీ కమ్లీమోత్యనాయక్, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ తిరునగరి వేణుగోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహ్మా రెడ్డి, నాయకులు బ్రహ్మచారి, పాలాది ఆంజనేయులు, భాస్కర్ రెడ్డి, యాదయ్య గౌడ్, జంగారెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లేశ్‌గౌడ్, సాయిరెడ్డి, హన్మనాయక్, శేఖర్ రెడ్డి, బిక్కునాయక్, రవీందర్ రెడ్డి, సోమయ్య, క్యామ రాజేశ్, అశోక్‌రెడ్డి, తరుణ్, జగదీశ్, సక్రు, సేవ్య, పాండు,అర్చకులు శ్రీధర్, శ్రీమన్నారాయణ, పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

భక్తి శ్రద్ధలతో శ్రీ భక్తమార్కండేయ జయంతి



భక్త మార్కండేయ స్వామి డోలారోహణం

ఆమనగల్లు : పట్టణంలోని గుర్రంగుట్టపై గల మార్కండేయస్వామి దేవాలయంలో శ్రీ భక్తమార్కండేయ స్వామి జయంతి వేడుకలను సోమవారం మండల, మహిళా, యువజన పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు సమీప గ్రామాల భక్తులు, పద్మశాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పద్మశాలి సంఘం మండల ఆధ్వర్యంలో భక్తులకు వసతులు ఏర్పాటు చేశారు. అర్చకులు భూషణ్, శరత్‌చంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. మహిళలు స్వామి వారికి డోలారోహణం నిర్వహించారు. పట్టణానికి చెందిన గుజ్జరి ప్రవీణ్‌స్రవంతి ఆధ్వర్యంలో శివస్వాములకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు అప్పం శ్రీను, ఎంగళి బాలకృష్ణ, గాజుల శ్రీను, పాలాది శ్రీను, చెర్కు రవి, మామిడి శెట్టి రవి, ఎంగళి యాదగిరి, అప్పి, చంద్రమౌళి, అప్పం అలివేలు, శ్రీలత, చెర్కు విజయ పాల్గొన్నారు.

చెల్లిని ప్రేమిస్తున్నాడని యువకుడి కిడ్నాప్

● బైక్‌లపై స్నేహితులతో వచ్చి ఎత్తుకెళ్లిన బాలిక అన్న

● యువకుడిని చితకబాదిన వైనం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 12 : చెల్లిని ప్రేమిస్తున్నాడనే కక్షతో అన్న ఓ యువకుడ్ని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడిన సంఘటన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్‌పట్టణం, సూర్యనగర్‌కు చెందిన సూరిమళ్ల ఉదయ్‌రాజ్ (23) ఈనెల 8న పోచారం మున్సిపల్ సంస్కృతి టౌన్‌షిప్‌లో ఉంటున్న తన స్నేహితులైన పృథ్వీ, చైతన్య వద్దకు వచ్చాడు. కాగా ఈనెల 10న నిజామాబాద్ సూర్యనగర్‌కు చెందిన తనుష్ మరో ముగ్గురు స్నేహితులతో రెండుబైక్‌లపై సంస్కృతిటౌన్‌షిప్‌కు వచ్చి ఉదయ్‌రాజ్‌ను కిడ్నాప్ చేశాడు. అక్కడి నుంచి మల్కాజ్‌గిరిలో ఓ గదికి తీసుకెళ్లి ఉదయరాజ్‌పై దాడిచేశారు. అనంతరం బోల్లారానికి తీసుకెళ్లి చితకబాదారు. కిడ్నాప్ విషయం తెలియగానే పోచారం ఐటీసీ పోలీసులు నాలుగు బృందాలుగా రంగంలోకి దిగారు. పోలీసులు గాలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న తనుష్ అతన్ని తార్నాకలో అర్ధరాత్రి వదిలిపెట్టి పరారయ్యారు. పోలీసులు ఉదయ్‌రాజ్‌ను అదుపులోకి తీసుకుని వైద్యం అందించారు. ఉదయ్‌రాజ్ నిజామాబాద్‌లో తనుష్ చెల్లిని ప్రేమించడానే కక్షతో కిడ్నాప్‌కు పాల్పడి, దాడి చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు రోజులుగా డాక్టర్లు లేకుండానే వైద్య సేవలు

● అన్నీ తామై నిర్వహిస్తున్న నర్సులు

● ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

బషీరాబాద్, ఫిబ్రవరి 12: ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)లో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందని సంఘటన సోమవారం బషీరాబాద్ పీహెచ్‌సీలో వెలుగుచూసింది. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ రెండు రోజులుగా నర్సులే అన్నీ తామై వైద్య సేవలందిస్తున్నారు. డాక్టర్. పవిత్ర రెగ్యూలర్ మెడికల్ అఫీసర్‌గా ఉండగా, డాక్టర్ శ్రీకాంత్, సురేష్ ఇద్దరు వైద్యులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. డాక్టర్. పవిత్రకు ఫ్యామిలీ ప్లానింగ్ జిల్లా అఫీసర్‌గా బాధ్యతలు అప్పగించడంతో మిగతా ఇద్దరు వైద్యులు విధులు కొనసాగిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం వైద్యశాఖలో డిప్యూటేషన్లను రద్దు చేయడంతో డాక్టర్. శ్రీకాంత్ తాండూరు మండలంలోని జినుగుర్తి పీహెచ్‌సీకి తిరిగి వెళ్లిపోయారు. ఉన్న ఒక డాక్టర్. సురేష్ అత్యవసర పరిస్థితిలో సెలవు పెట్టడంతో వైద్యం అందించేవారే కరువయ్యారు. రెండు రోజులుగా వైద్యులు ఎవరూ కనిపించకపోవడంతో చేసేదేమిలేక అక్కడున్న నర్సులకు రోగం చెప్పుకొని వారిచ్చిన మందు బిల్లలు తీసుకెళ్తున్నారు. మరి కొందరు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి చికిత్సలు పొందున్నారు. డాక్టర్లు లేకపోతే రోగులకు వైద్య సేవలేలా అందుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి వైద్య సేవాలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులను, నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్, మోదీ

● సీడబ్ల్యుసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి

కొందుర్గు, ఫిబ్రవరి, 12 : రైతులను, నిరుద్యోగులను కేసీఆర్, నరేంద్రమోడీలు మోసం చేశారని సీడబ్ల్యుసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ చేస్తున్న న్యాయ్ యాత్రకు సంఘీభావంగా పాలమూరు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఆయన చేస్తున్న పాలమూరు న్యాయ్‌యాత్రను సోమవారం మండల పరిధిలోని చెర్కుపల్లిలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చెర్కుపల్లి గ్రామంలో పర్యటించి కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. విశ్వనాథ్‌పూర్, పాత ఆగిర్యాల, ఆగిర్యాల, వెంకిర్యాల, తంగళ్లపల్లి గ్రామాల్లో యాత్రను నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ 2014కు ముందు ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కరెంటు బిల్లులు కట్టేవారే కాదని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకే, విద్యుత్ బిల్లులు వసూలు చేయడం ప్రారంభించారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల లోపు కరంటు ఉచితంగా, రూ.500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ను త్వరలోనే అందించనుందని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రతీ సంవత్సరం 2 కోట్ల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారని, పది సంవత్సరాల్లో 20 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు.వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని కోరారు.



చౌదరిగూడ : మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తా

షాద్‌నగర్ నియోజవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి, గెలిపించారని, అందువల్ల అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి సోమవారం పాలమూరు న్యాయ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఆరు గ్యారేంటీలను తప్పని సరిగా అమలు చేస్తుందని చెప్పారు. మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీచంద్‌రెడ్డి గెలిస్తే, అభివృద్ధిలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి పనిచేస్తారని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. తంగళ్లపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖాజనా ఖాళీ చేసి, రాష్ట్రాన్ని అదోగతి పాలు చేసిందని ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కొత్తూరు మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ రాజు, నాయకులు గోవర్ధన్‌గౌడ్, కె రాములు గౌడ్, జితేందర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, బాబర్‌ఖాన్, జహంగీర్, పాల్గొన్నారు.

లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణమేమైంది

చౌదరిగూడ : పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులను, పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఎందుకు ఎందుకు చేపట్టలేదని వంశీచంద్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆధరణ చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని అన్నారు. పాలమూరు న్యాయ యాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఎదిర, రావిర్యాల, గుర్రంపల్లి ఇంద్రనగర్,చౌదరిగూడ వరకు కొనసాగింది. అనంతరం చౌదరిగూడలో కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జిల్లేడ్ చౌదరిగూడ పేరుకే మండలం కానీ ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడం విడ్డూరమని అన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పాలన కొనసాగుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపలిశంకర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీపీ యాదమ్మ, వైస్ ఎంపీపీ అస్రా బేగం, మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, ఎంపీటీసీలు సత్యనారాయణరెడ్డి, రజిత, నాయకులు చంద్రశేఖర్, యాదయ్య, పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడాలి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్ , ఫిబ్రవరి 12: కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయ భూములను పరిరక్షించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు, ఆలయ కమిటీ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొద్ది సేపు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయానికి సంబంధించి 120, 130 సర్వే నెంబర్లలో కొంత భాగం భూమి ఆక్రమణకు గురైందని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిదంగా ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు, బోరు బావులు తోడుతున్నారని తెలిపారు. విచారణ జరిపి బాధ్యులైన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసుస్టేషన్ చేరుకొని సీఐ శివప్రసాద్‌కు భూముల ఆక్రమణలపై పిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, తిరునగరి వేణుగోపాల్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, ఆలయ నిర్వాహకుడు పాలాది ఆంజనేయులు, స్థానిక నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, కే.చందోజీ, గూడూరు జంగారెడ్డి, సాయిరెడ్డి, యాదయ్యగౌడ్, బ్రహ్మాచారి, వెంకట్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, బిక్కునాయక్, రవీందర్ రెడ్డి, రాజేశ్, సేవ్య, సక్రు, జగదీశ్, తరుణ్, అశోక్‌రెడ్డి, పాండు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్

షాబాద్, ఫిబ్రవరి 12 : తెలంగాణ ఉద్యమకారుడు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మద్దూర్ మల్లేష్ త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నట్లు తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో ఉద్యమకారులకు గౌరవం లేదని, ప్రత్యేక తెలంగాణ కోసం మండలం నుంచి తాను ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశానని అన్నారు. చెన్నయ్య, చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ టీంకు కిట్లు పంపిణీ

శామీర్‌పేట, ఫిబ్రవరి 12 : మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని క్రీడా పాఠశాలలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి, తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు స్టాన్లీ జోన్స్ జాతీయ స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ టోర్నమెంటులో పాల్గొనే క్రీడాకారులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహ్మదాబాద్‌లో జరిగే 19వ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులు రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన 13 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చి ఎంపికయ్యారని అసోసియేషన్ ఆర్గనైజర్ కూరపాటి రాజశేఖర్ చెప్పారు. ఎంపికైన టీంకు కోచ్, మేనేజర్‌గా శ్వేత, అశోక్‌కుమార్‌ల వెళుతారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు అశోక్‌కుమార్, దయాల్, శేఖర్, వరలక్ష్మీ, సురేందర్, గోపాల్, పాల్గొన్నారు.

రేపు కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు

● జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 12 : ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని ఎల్బీ స్టేడియానికి తీసుకు వెళ్లే ఏర్పాట్ల కోసం సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రంగారెడ్డి జిల్లాలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన 883, రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన 506 మందికి నియామక పత్రాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. 14న సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించిన అభ్యర్థులు గచ్చిబౌలిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు, రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించిన అభ్యర్థులు అంబర్‌పేట పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు ఉదయం 8 గంటలకు రావలసిందిగా వారికి తెలపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఆర్టీసీ బస్సులలో వారిని ఎల్బీస్టేడియంకు తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు. సంబంధిత అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు జిల్లా విద్యశాఖ అధికారి సుశీందర్‌రావు, సోషల్ వెల్ఫేర్ అధికారి రామరావు, గిరిజన సంక్షేమ అధికారి రామేశ్వరి దేవి, మైనార్టీ సంక్షేమాధికారి నవీన్‌రెడ్డి, స్థానిక రవాణా శాఖ అధికారి రఘునందన్‌గౌడ్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ప్రజావాణి ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి :

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 149 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ శశాంక తోపాటు అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్


మహేశ్వరం, ఫిబ్రవరి 12 : మతతత్వ విధానాలను దేశ ప్రజలు ప్రతిఘటించాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దుబ్బచర్ల గ్రామంలో కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న మతతత్వ విధానాలకు సంబందించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ సంఘాలు ఏకమై కార్పొరేట్, మతతత్వ విధానాలను, నిరసిస్తూ ఫిబ్రవరి 16 న సమ్మె చేయనున్నట్లు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సీఐటీయు, సీపీఎం నాయకులు శేఖర్, ప్రకాష్, శ్రీదర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

మహేశ్వరంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి

● మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఎల్ఆర్

మహేశ్వరం, ఫిబ్రవరి 12 : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవాలని కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే మహేశ్వరం నియోజక వర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ నాయకులు పాండురంగారెడ్డి, హరికృష్ణారెడ్డి, నవీన్, గణేష్, బాబయ్య, సుబ్బు, బాల్‌రాజ్, గోవర్ధన్, నారాయణరెడ్డి, రంజిత్‌కుమార్, అర్జున్, సుధాకర్, స్వామి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవించాలి

● కేంద్ర రీసెర్చ్ అభివృద్ధి శాఖ డైరెక్టర్ అమీరుల్లా ఖాన్



అమీరుల్లా ఖాన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మంజూర్

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 12 : సామాజిక విలువలను కాపాడుకుంటూ విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు గురువులను గౌరవించాలని కేంద్ర రీసెర్చ్ అభివృద్ధి శాఖ డైరెక్టర్ అమీరుల్లా ఖాన్, సహాయత ట్రస్ట్ చైర్మన్ మంజూరు గౌరీలు సూచించారు. చాలెంజర్ ఇంటర్‌నేషనల్ పాఠశాలలో ఆదివారం రాత్రి జరిగిన 12వ వార్షికోత్సవ వేడుకల్లో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సహాయత ట్రస్ట్ సీఈఓ అనిసుద్దీన్, ట్రెజరర్ గౌరీద్, ప్రిన్సిపాల్ పర్వీన్, మహ్మద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● పాప్ సింగర్ స్మిత



మాట్లాడుతున్న పాప్ సింగర్ స్మిత

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 12 : బాలికలు చదువులో రాణిస్తూ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాప్‌సింగర్ స్మిత అన్నారు. సోమవారం కొడంగల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వికారాబాద్ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 103 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు మురారి, చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి అనిల్, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, జిల్లా డిప్యూటి డీఎమ్మెచ్వో రవీంద్రయాదవ్, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, గౌరారం గోపాల్, వీరేశం, విజయలక్ష్మీ, రాధిక, లక్ష్మీ, స్రవంతి, శ్యామల పాల్గొన్నారు.

కొత్తగడి రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి



వినతి పత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 12: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్త గడి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్, పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి వై గీత డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

తాండూరు ప్రజలకు రుణపడి ఉంటా


తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసిన మల్కాపూర్ గ్రామస్తులు

తాండూరురూరల్, ఫిబ్రవరి 12: తనను ఎమ్మెల్యేగా గెలిపించిన తాండూరు ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసారు. మల్కాపూర్ గ్రామ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా మల్కాపూర్ గని కార్మిక సొసైటీ ద్వారా పేద కార్మికులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూరు నియోజక వర్గంలో తన గెలుపునకు కృషిచేసిన వారిని మరువలేనన్నారు. తాండూరుకు వచ్చినప్పుడు సమస్యలపై చర్చిస్తామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గుర్రంపల్లి రాందాస్, బోయిని నర్సింహులు, గంజి గోపాల్, కిష్టప్ప, సతీష్, నర్సింహులు, మొగులాన్ తదితరులున్నారు.

ప్రభుత్వ భూములను సంరక్షించాలి


జిల్లా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్, ఫిబ్రవరి 12: ప్రభుత్వ భూములను సంరక్షించాలని సోమవారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని తప్పుడు పత్రాలతో, అధికారులను మచ్చిక చేసుకుని జీవో 59 ద్వారా కొంత మంది సొంతం చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. కాసుల కక్కుర్తితో మున్సిపల్ అధికారులు అక్రమంగా నిర్మాణ అనుమతులు జారీ చేశారని ఆరోపించారు. జీవో-59 ద్వారా ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయని గ్రహించిన ప్రభుత్వం ఆజీవో ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తున్నామని, క్షేత్ర స్థాయి విచారణ తర్వాతే వాటికి ఆమోదం తెలుపుతామని అన్నారు. ఇదివరకే సీఎం ప్రకటించారని గుర్తుచేశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మాత్రం అవేమీ పట్టనట్లు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ చేసిన అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయటంతో అక్రమ నిర్మాణాలను తొలగించాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. ఆ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలు నెలకొల్పేందుకు కేటాయించాలని కోరుతూ వినతి పత్రం ద్వారా అధికారులను కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా అనుమతులు మంజూరు చేసిన మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా అధికారి చంద్రావతి ప్రభుత్వ స్థలంలో కొనసాగుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని నాగారం మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బిల్‌కలెక్టర్ ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు శ్రమదానం చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 12: ప్రతీఒక్కరు శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అవుషాపూర్ అబ్దుల్ కలాం పార్కులో సోమవారం ఆయన శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇందుకోసం తగిన సమయాన్ని కేటాయించాలన్నారు. పరిసరాలు బాగుంటేనే వాతావరణం బాగుంటుందని తెలిపారు. మొక్కలను పెంచి కాలుష్య నివారణకు దోహదపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కల బెడదపై ఎంపీపీకి వినతి

తమ గ్రామంలో కోతులు, కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎదులాబాద్‌కు చెందిన బీజేపీ నాయకులు సోమవారం ఎంపీపీ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాచకట్ల శ్రీశైలం, ఎదులాబాద్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎర్రోళ్ళ కుమార్, చిరంజీవి, వెంకటేష్, ప్రతాప్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీపీకి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఎస్పీని కలిసిన పరిగి సీఐ


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ శ్రీనివాస్

పరిగి, ఫిబ్రవరి 12: పరిగికి కొత్తగా సీఐగా బాధ్యతలు స్వీకరించిన సీఐ ఎన్.శ్రీనివాస్ సోమవారం వికారాబాద్ ఎస్పీ ఎన్.కోటిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అదేవిధంగా పరిగికి కొత్తగా వచ్చిన ఎస్ఐ సంతోష్ కూడా ఎస్పీని కలిశారు.

ఎస్ఐకి సన్మానం


ఎస్ఐ మధుసూదనరెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పూడూరు, ఫిబ్రవరి 12: చన్‌గోముల్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్ఐ మదుసూదన రెడ్డిని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, రఘునర్సింహారెడ్డి, రవి, రమేష్‌లు ఎస్ఐ ని కలిసి సోమవారం శాలువాతో సన్మానించారు.

ఘనంగా మార్కండేయ జయంతి


ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం సభ్యులు

వికారాబాద్, ఫిబ్రవరి 12: వికారాబాద్ పట్టణానికి సమీపంలోని అనంతగిరిగుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి సన్నిధిలో మార్కండేయ మహర్షి జయంతి ఉత్సవాలు సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేకపూజలు, అర్చనలు, అభిషేకాల అనంతరం అన్నదానం చేశారు. ఎంపీ రంజిత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, కిషన్ నాయక్, సత్యనారాయణ తదితరులు దర్శించుకున్నారు.

శామీర్‌పేట: పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శామీర్‌పేట పరిధిలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో మార్కండేయ జయంతి సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చన, మహా మంగళహారతితో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శామీర్‌పేట మాజీసర్పంచ్ బత్తుల కిశోర్‌యాదవ్ ఆలయ అభివృద్ధికి రూ.లక్షా 11వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లూబాయి, జడ్పీటీసీ అనిత పాల్గొన్నారు.

పేదల భూములు తీసుకోవడం సరికాదు

కొడంగల్, ఫిబ్రవరి 12: అభివృద్ధి పేరుతో కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లిలో గల సర్వే నెం.19లో గల భూములను తీసుకోవడం సరికాదని కేవీపీఎస్ రాష్ట్ర సభ్యుడు నాగార్జునరావు, ప్రభుత్వ భూ పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకుడు పోరాటాల రామన్న అన్నారు. అప్పాయిపల్లిలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అప్పాయిపల్లిలో గల 74 ఎకరాల 17 గుంటల భూమిని అధికారులు అభివృద్ధి పేరుతో తీసుకునేందుకు రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల చంద్రప్ప, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏళ్లుగా ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు అన్యాయం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో అంజి, వెంకటయ్య, రమేశ్, ఆనంద్ పాల్గొన్నారు.

ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎంగా సీసీ పండరి

ధారూరు, ఫిబ్రవరి 12: మండల ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎంగా సీసీ(కమ్యూనిటీ కోఆర్డినేటర్) పండరికి బాధ్యతలు అప్పగించారు. ఏపీఎం శ్రీనివాస్ విధుల్లో నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేయడం, సమావేశాలకు గైర్హాజరవడం తదితర కారణాలను పరిగణలోకి తీసుకుని జనవరి 23న ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఏపీఎంగా సీసీ పండరిని నియమించారు.

సంక్షిప్తంగా..

● **తాండూరురూరల్:** గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మిట్టబాస్పల్లి గ్రామ ప్రత్యేకాధికారి చాంద్‌పాషా అన్నారు. మిట్టబాస్పల్లిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం గ్రామంలో పర్యటించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

● **పరిగి:** హెచ్ఎం అంజిలయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు వజ్రమాల, ప్రియాంక, కార్తీక్‌ల చేతుల మీదుగా సోమవారం పరిగిలోని జడ్పీహెచ్ఎస్‌నెం.01లో విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు ఉచితంగా అందజేశారు. వారిని హెచ్ఎం గోపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

● **పరిగి/కొడంగల్:** ఫిబ్రవరి 16న దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య కోరారు. బంద్‌కు సంబంధించి పోస్టర్లను సోమవారం పరిగిలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు హబీబ్, సత్యయ్య, రఘురాం, శేఖర్, ప్రశాంత్, రమేశ్, బాలు పాల్గొన్నారు. అదేవిధంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య కొడంగల్ పట్టణ శివారులోని మిషన్‌భగీరథ ప్లాంట్ దగ్గర సోమవారం కార్మికులతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. మిషన్ భగీరథ ఏఈ యాదయ్యకు కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు.

● **కులకచర్ల:** పుట్టపహడ్‌లో వెలిసిన శ్రీ కోదండ సీతారామ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త విశ్వకర్మ రమేశ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 12: మున్సిపాలిటీ పరిధిలోని ఆయావార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోచారం మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు ఇస్మాయిల్‌ఖాన్ గూడలో సోమవారం రూ.10లక్షలు, మూడవ వార్డులో రూ.10లక్షలు, 4వ వార్డులో రూ.20లక్షలతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లలో మున్సిపాలిటీ పరిదిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. ప్రధానంగా సీసీ, బీటీ రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీల నిర్మాణం, తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు గొంగళ్ల మహేశ్, రాజశేఖర్, ఏఈ నరేష్‌కుమార్, నాయకులు బాలేష్, రమేష్, కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్

గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలి


గృహజ్యోతి పథకానికి లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది

నవాబుపేట, ఫిబ్రవరి 12: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేయనున్న గృహజ్యోతి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని నవాబుపేట విద్యుత్ శాఖ సిబ్బంది సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన రశీదు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నెంబర్‌ను విద్యుత్ సిబ్బందికి అందించి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

మోమిన్‌పేట్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల్లో గృహజ్యోతి పథకాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య అన్నారు. మొరంగపల్లిలో సోమవారం విద్యుత్ అధికారులు, సిబ్బంది, గ్యాస్ ఏజెన్సీ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల వివరాలను సేకరించారు. 200యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకానికి లబ్ధిదారులు సరైన వివరాలను అందించి వినియోగించుకోవాలన్నారు.

దోమ: మండలంలోని బొంపల్లి గ్రామంలో సోమవారం విద్యుత్ సిబ్బంది గృహజ్యోతి పథకానికి లబ్ధిదారుల నుంచి వివరాలను సేకరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంతిరెడ్డి, మాజీ సర్పంచ్ కోళ్ల సురేశ్, బాల్‌రాజ్, మల్‌రెడ్డి, శేఖర్, రాము, రమేశ్, భాస్కర్ పాల్గొన్నారు.


బొంపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న విద్యుత్ సిబ్బంది

వైభవంగా శివపార్వతుల కల్యాణం


విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

పెద్దేముల్, ఫిబ్రవరి 12: గొట్లపల్లి మల్లిఖార్జునస్వామి దేవాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గొట్లపల్లి గ్రామసమీపంలోని మల్లిఖార్జునస్వామి ఆలయంలో మూడురోజులుగా జాతర మహోత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు సోమవారం తెల్లవారు జామున స్వామివారికి పల్లకీసేవ, అగ్నిగుండం కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం మహిళలు పెద్దసంఖ్యలో బోనాలతో తరలి వచ్చారు. గ్రామం నుంచి డప్పువాయిద్యాల మధ్యన ఊరేగింపుగా వచ్చి ఆలయంలో శివపార్వతులకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం గ్రామపెద్దల సమక్షంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ధర్మకర్త పూజారి మల్లప్ప దంపతుల చేతులమీదుగా గ్రామపెద్దలు శివపార్వతుల కల్యాణాన్ని జరిపించారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కల్యాణానికి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

పెద్దనందిగామలో..

కొడంగల్ రూరల్: పెద్దనందిగామలోని శ్రీ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు విగ్రహాలకు అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. విగ్రహాలను ఊరేగించారు. శివకుమార్, తాండూర్‌కు చెందిన అర్జున్‌రెడ్డి అన్నదానం చేశారు.

దేవాదాయ శాఖ పరిధిలోకి

పరిగి వేంకటేశ్వరస్వామి ఆలయం


పరిగిలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివరాలు సేకరిస్తున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్

పరిగి,ఫిబ్రవరి 12: పరిగిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఇక నుంచి దేవాదాయ శాఖ ఆధీనంలో కొనసాగుతుందని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ తెలిపారు. దేవాదాయశాఖ అధికారుల బృందం పరిగిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్, షాపుల్లో అద్దెకు ఉంటున్న వ్యాపారస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. షాపుల అద్దెకు సంబంధించి డబ్బులు ఎవరికిస్తున్నారని అడగ్గా ఒక్కొక్కరు ఒక్కో సమాధానం చెప్పారు. దీంతో కొంత మంది బినామీ పేర్లపై షాపులు నడుస్తున్నట్లు తెలుసుకుని రూ.5వేల నుంచి రూ.8వేల వరకు వసూళ్లు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఆలయంలో ఏ వస్తువులు ఉన్నాయని పూజారిని అడగ్గా వెండి, ఇత్తడి వస్తువులు ఉన్నాయని చెప్పారు. కానుకల హుండీ ఎక్కడని అడగ్గా.. ప్రస్తుతం తప్పు పట్టిందని బాగుచేయడానికి పంపించామని బదులిచ్చారు. ఇకపై ప్రైవేట్ వ్యక్తుల ద్వారా ఎలాంటి లావాదేవీలు జరగవని అసిస్టెంట్ కమిషనర్ వెల్లడించారు. ఆలయానికి వచ్చే ప్రతీ రూపాయికి లెక్క ఉంటుందని స్పష్టం చేశారు. ఆలయానికి మూడెకరాల స్థలం ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. అదేవిధంగా రాబడి, ఖర్చులు, దేవాదాయ శాఖ నుంచి వెచ్చించిన ఖర్చుల వివరాలను త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేసి తెలుపుతామన్నారు. స్వామివారి ఆభరణాలు ఉన్నట్లు గుర్తించామని, అవి ఇతరుల వద్ద ఉన్నాయని, వాటిని సేకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, సీఐ ఎన్.శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, నాయకులు బాబయ్య, బి.ప్రవీణ్‌రెడ్డి, జె.ఆశోక్‌రెడ్డి, రామకృష్ణ, ఆనందం, తావుర్యానాయక్, జగన్మోహన్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలకు కొత్తదారులు



ఒకే ట్రాలీ నెంబర్‌తో ఉన్న రెండు ట్రాక్టర్లు

తాండూరు, ఫిబ్రవరి 12: తాండూరు మండలం ఖాజాపూర్ వాగు నుంచి తాండూరు పట్టణం రైల్వేస్టేషన్లు జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం 36 ట్రిప్పుల ఇసుక తరలింపు కోసం అనుమతులు పొందారు. నాలుగు రోజుల పాటు, 8 ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించేందుకు అనుమతి పొందారు. 36ట్రిప్పులను ఒకేరోజు ఇసుక తరలించే అవకాశం ఉన్నప్పటికీ నాలుగు రోజులు వ్యవధి కల్పించారు. ఇదే అదనుగా భావించిన ఇసుక అక్రమార్కులు ట్రాక్టర్ ట్రాలీ నెంబర్ టిఎస్ 34టి 97 39 పేరిట అనుమతులు పొంది మరో ట్రాక్టర్‌ట్రాలీకి అదే నంబర్ స్టిక్కర్ అతికించి ఒక ట్రాలీ రైల్వేస్టేషన్ తరలిస్తుండగా మరొకటి ట్రాలీ వివిధ చోట్ల ఇసుకను డంపింగ్ చేయడంతో పాటు అక్రమంగా ఇసుకను అమ్ముకుంటున్నారు. రెవెన్యూ అధికారులు ఎన్ని ట్రిప్పులకు ఇసుక అనుమతులు ఇస్తున్నారు. ఇక్కడ నుండి ఎక్కడి వరకు, ట్రాక్టర్లు ఫిట్‌నెస్ ఉన్నాయా? లేవా? డ్రైవర్లు ఎవరనే విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా అడ్డగోలుగా అనుమతులు ఇస్తూ డబ్బులు తింటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఏడవ గ్యారంటీలో భాగంగా తాండూరులో ఇసుక సుద్దా అక్రమవ్యాపారం జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఓవైపు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొంటున్నప్పటికీ మరోవైపు అధికారులు ఇసుక అక్రమ రవాణా దారులు కుమ్మక్కై అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. వికారాబాద్‌లో ప్రభుత్వ భవనం నిర్మాణం పేరిట బాబి నుండి పెద్దఎత్తున ఇసుకను అక్రమంగా తరలించారని ఆరోపణలు ఉన్నాయి.

క్రైం కార్నర్

స్కూల్ విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

● ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు
● చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జుబేర్

వికారాబాద్, ఫిబ్రవరి 12: వికారాబాద్ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థి జుబేర్‌ను పాఠశాలలో ఉపాధ్యాయుడు నర్సింహులు చితకబాదాడు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు బాలున్ని వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చైతన్య స్కూల్ నుంచి టీచర్ నర్సింహులుపై కఠిన చర్యలు తీసుకుని వెంటనే తొలగించాలని స్కూల్ వద్ద ఆందోళన చేశారు.

లారీని ఢీకొన్న బైక్.. వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయాలపాలైన బస్వరాజ్

తాండూరు రూరల్, ఫిబ్రవరి 12: ముందు వెళ్తున్న లారీని ఢీకొని బైక్‌పై ఉన్న వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ ఘటన తాండూరు మండలం కోటబాస్పల్లిలో సోమవారం చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని చించోళి తాలూక చౌడాపూర్‌కు చెందిన బస్వరాజ్ బైక్‌పై తాండూరు వస్తున్నాడు. అదే సమయంలో కోటబాస్పల్లి శివారులోకి రాగానే ముందుగా వెళ్తున్న లారీని బైక్ ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న బస్వరాజ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అంబులెన్స్‌లో తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే బాధితుడు బస్వరాజ్ బైక్‌లో కల్లు, కర్ణాటకకు చెందిన గుట్కాలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. నిర్లక్ష్యంగా లారీ నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మరో వ్యక్తికి..


తీవ్ర గాయాలపాలైన రాములు

పరిగి,ఫిబ్రవరి 12: బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని హనుమాన్ గండి వద్ద చోటు చేసుకుంది. మున్సిపల్ పరిధిలోని మందులకాలనీకి చెందిన బుడగ జంగం రాములు బైక్‌పై పరిగికి వస్తుండగా పరిగి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొని టైర్లకింద పడింది. దీంతో రాములు కాళ్లు విరిగి నుజ్జునుజ్జయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతన్ని పరిగిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించారు. రాములు భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలుడిపై కుక్కల దాడి


చికిత్స పొందుతున్న బాలుడు

పెద్దేముల్, ఫిబ్రవరి 12: పెద్దేముల్‌లో వీధికుక్కలు దాడి చేయడంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరిమివేయడంతో బాలుడికి ప్రాణాపాయం తప్పింది. మండల కేంద్రానికి చెందిన కోళ్ళ శ్రీనివాస్ కుమారుడు అబ్నేర్(6 సంవత్సరాలు) సోమవారం ఇంట్లో నుంచి ఆడుకోవడానికి బయటకు వెళ్లాడు. వీధిలో బాలుడు ఆడుకుంటున్న సమయంలో కుక్కలు దాడిచేశాయి. దీంతో బాలుడు కేకలు వేయడంతో స్థానికులు గమనించారు. బాలుడిపై దాడిచేస్తున్న కుక్కలను కర్రలతో తరిమివేశారు. బాలుడిని కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాలుడికి ప్రమాదమేమీ లేదని వైద్యులు తెలిపారు. గ్రామంలో చికెన్, మటన్ వ్యర్థాలను వ్యాపారస్థులు ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా పారేస్తున్నారు. వాటికోసం వీధికుక్కలు గుంపులు గుంపులుగా గ్రామంలో తిరుగుతున్నాయి. వీధిలో ఒంటరిగా కనిపించిన పిల్లలపై దాడిచేస్తున్నాయి. గతంలోనూ ఇలాంటి దాడులు అనేకం జరిగాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన ఆటో

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 12: అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బొంరాస్‌పేట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆదివారం రాత్రి బురాన్‌పూర్ గ్రామ శివారులో నుంచి ఆటోను తనిఖీ చేయగా ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గర్తించారు. ఈ మేరకు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పౌరసరఫరాల అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు. సిరిగిరి అజయ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి అందిస్తున్న ఎస్ఐ అబ్దుల్ రవూఫ్

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 12: మండల కేంద్రానికి చెందిన చిన్న కేశవులు ఇటీవలే తన ఫోన్ పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకున్నారు. ఎస్ఐ రవూఫ్ సోమవారం బాధితుడిని స్టేషన్‌కు పిలిపించి సెల్‌ఫోన్‌ను అప్పగించారు.

వీరభద్రేశ్వర ఆలయంలో చోరీ

తాండూరు రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని వీరారెడ్డిపల్లి వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కరన్ కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వీరభద్రేరాలయంలో చొరబడ్డారు. ఉదయం పూజారి మడమతి మల్లేశం వచ్చి చూడగా హుండీ పడేసి ఉంది. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో రూ.70వేల విలువ గల కానుకలు, నగదు ఉన్నట్లు పూజారి తెలిపారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు

తాండూరురూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని వీరారెడ్డిపల్లిలో పేకాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. వీరారెడ్డిపల్లిలో సోమవారం పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. అక్కడ అంజిలప్ప, బంటు నర్సింహులు, ఈదుల ఆశప్ప, నల్లోళ్ల అంజిలప్ప, కుర్వ మల్లప్పలను పట్టుకున్నట్లు తెలిపారు. వీరిలో నలుగురు పారిపోయారని, ఇద్దరి వద్ద లభించిన రూ.3,175ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.